హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. కాగా, సమావేశానికి జగిత్యాల కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ హాజరయ్యారు.

-జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 24

ఖోఖో పోటీల్లో కీర్తన ప్రతిభ



కీర్తనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కథలాపూర్, డిసెంబర్ 24: మండలంలోని అంబారిపేట జడ్పీ పాఠశాల విద్యార్థిని యెంజాల కీర్తన ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలికల ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపింది. సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ గంగారాజం, విద్యా కమిటీ చైర్మన్ ధాత్రిక ఉమ, ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, పీఈటీ వాసాల రాజు కీర్తనను అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మెట్‌పల్లిలోని చైతన్యనగర్ శ్రీ వాసవి హైస్కూల్‌లో 2003-04 బ్యాచ్ పదో తరగతికి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు.

- మారుతీనగర్, డిసెంబర్ 24

తుర్తిలో జియో టవర్ ఏర్పాటు చేయాలి

- అధికారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన

జియో అధికారులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కథలాపూర్, డిసెంబర్ 24: కథలాపూర్ మండలంతుర్తి గ్రామంలో జియో టవర్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, తుల ఉమ, మార్కెట్ మాజీ చైర్మన్ లోకబాపురెడ్డి, సర్పంచ్ శేఖర్ కలిసి విన్నవించారు. కేటీఆర్ వెంటనే జియో అధికారులతో మాట్లాడారు. మార్చి 2024లోపు జియో టవర్ పనులు పూర్తి చేస్తామని జియో అధికారులు తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.

మేరు కులానికి సహాయ సహకారాలు అందిస్తాం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, డిసెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ కులానికి చెందిన మేరు కులస్తులకు సహాయ సహకారాలు అందిస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణ మేరు సంఘం సమావేశ మందిరంలో జిల్లా మేరు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు కుట్టు మిషన్లను ప్రభుత్వం ద్వారా విడతల వారీగా అందించే ప్రయత్నం చేస్తామన్నారు. టీఆర్‌నగర్‌లో వివిధ కుల సంఘాలకు స్థలం మంజూరు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీంలో ఇప్పటికే మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశామన్నారు. మేర కులస్తుల సమస్యలు, వారికి కావల్సిన సదుపాయాల కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిషనర్ పోడిశెట్టి అనిల్‌కుమార్, వార్డు కౌన్సిలర్ దాసరి లావణ్య ప్రవీణ్, సంఘ సేవకులు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గట్ల రమేష్, పట్టణ అధ్యక్షుడు మాడిశెట్టి మల్లేశం, జిల్లా కన్వీనర్ వెన్న మహేశ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గట్ల హన్మండ్లు, ఉపాధ్యక్షుడు గట్ల ప్రతాప్, ప్రధాన కార్యదర్శి కొట్టురి రమేశ్, సహాయ కార్యదర్శి వోదెల గంగాధర్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్, కొక్కు శ్రీనివాస్, సంగ శ్రీధర్, గట్ల మీనయ్య, రామగిరి రామస్వామి, దీకొండ గణేష్, కొట్టూరి సంజీవ్, యం.పూర్ణేష్, రామగిరి మురళి, రాపర్తి సతీష్, రాపర్తి శ్రీనివాస్, గట్ల లక్ష్మణ్, పట్టణ కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని అన్ని మండలాల పట్టణ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శనతోనే చీడపీడలపై అవగాహన

శ్రీరాములపల్లిలో పసుపు తోటను పరిశీలించి వివరిస్తున్న కోఆర్డినేటర్ గంగాధర్

గొల్లపల్లి, డిసెంబర్ 24: పంట, పొలాలు, చేల క్షేత్ర సందర్శనతోనే చీడపీడలపై ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన వస్తుందని దేసి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గంగాధర్ పేర్కొన్నారు. ఆదివారం గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లి, గొల్లపల్లిలోని పసుపు, జామ, బీర, టమాట అంటు మొక్కల సాగు క్షేత్రాల్లో దేసి (డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్సన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) డీలర్స్ క్షేత్ర సందర్శన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్నారు. శ్రీరాములపల్లిలోని రైతు తిరుపతిరెడ్డికి చెందిన జామ, పసుపు, బొప్పాయి తోటలను పరిశీలించి రైతు అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే గొల్లపల్లిలో ఆధునిక పద్ధతితో అభివృద్ధి చేసిన బీర, టమాట అంటు మొక్కల సాగును పరిశీలించారు. అంటు మొక్కల సాగు లాభదాయకమని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, ఎక్కువ రోజులు పంట వస్తుందని, దిగుబడి 30 శాతం అధికమని రైతు, ఫర్టిలైజర్ డీలర్లకు క్షుణ్ణంగా వివరించాడు.

పేదల కోసమే ఉచిత కంటి శస్త్రచికిత్సలు

- ముప్పై ఏళ్లుగా ఆపరేషన్లు
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- పావని కంటి దవాఖాన, ఆపీ, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 12 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 24: పేద ప్రజలకు సేవ చేయాలనే ఆకాంక్ష, అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే ముప్పై ఏండ్ల నుంచి పేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు అందిస్తున్నానని జగిత్యాల ఎమ్మెల్యే, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు, డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పావని కంటి దవాఖాన, ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పావని కంటి దవాఖానలో 12మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. అంతేకాకుండా కంటి అద్దాలు, మందులు అందజేశారు. ఆపరేషన్లు చేయించుకున్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో జగిత్యాల జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరగా, దీంతో వెంటనే జగిత్యాలకు మెడికల్ కళాశాలను మంజూరు చేశారన్నారు. రూ.500 కోట్లతో కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మెడికల్ కళాశాలను మంజూరు చేసిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను సైతం అభివృద్ధి చేశామన్నారు. వంద పడకలతో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సైతం నిర్మించామని తెలిపారు. పట్టణంలోని జిల్లా ప్రధాన దవాఖానలో ఇప్పుడు వంద మంది వైద్యులు, నలుగురు కంటి వైద్య నిపుణులు పేదలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారన్నారని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ దవాఖాన వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు కంటిలో దుమ్ము, ధూళి పడకుండా జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు, ప్రసాద్, దవాఖాన సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అన్నివర్గాల మద్దతుతోనే రెండోసారి విజయం

అన్ని వర్గాల ప్రజల ప్రోత్సాహం, మద్దతుతోనే జగిత్యాల ఎమ్మెల్యేగా వరుసగా రెండోసారి విజయం వరించిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో వెలమ సంక్షేమ సంఘం 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వెలమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అదేవిధంగా వృద్ధాశ్రమానికి రూ. 50లక్షలు విరాళంగా అందజేసిన గండ్ర మోహన్‌రావును ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలకు హైదరాబాద్‌లో స్థలాలు ఇచ్చిన మాదిరిగానే జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో అన్ని కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణాల కోసం 18.5ఎకరాల స్థలాన్ని మంజూరు చేశామన్నారు. వెలమలు సమాజంలో అన్ని వర్గాలు, కులాలతో మంచి అనుబంధాన్ని కలిగి ఉంటారని పేర్కొన్నారు. వృద్ధాశ్రమ నిర్మాణానికి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వారికి ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వెలమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, సంఘం నాయకులు రాజేశ్వర్‌రావు, పురుషోత్తంరావు, హైకోర్టు అడ్వకేట్ కాసుగంటి లక్ష్మణ్‌కుమార్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేందర్‌రావు, సావిత్రి, కిషన్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల బదిలీలు చేపట్టాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి టీచర్ల వినతి

జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ దంపతులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 24: బదిలీలు చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఉపాధ్యాయ దంపతులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని కరీంనగర్ జిల్లాలోని ఉపాధ్యాయ దంపతులు కలిసి సమస్యలు విన్నవించారు. ఈసందర్భంగా వినతిపత్రం అందజేశారు. రెండేళ్లుగా స్పౌజ్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నామని, గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఉపాధ్యాయ దంపతులు వాపోయారు. అనంతరం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడారు. 317 జీవో తెరపైకి తీసుకువచ్చి జోనల్ విధానం ఇష్టారాజ్యంగా రూపొందించడంతో భార్య ఒక చోట, భర్త మరో చోట విధులు నిర్వర్తించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించి జోనల్ విధానం ఏర్పాటు చేయాలని, తాను శాసన మండలిలో సైతం మాట్లాడానని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయ దంపతుల బదిలీలు కేంద్ర ప్రభుత్వ గెజిట్‌లోనే ఉందని, 1655 సర్క్యులర్ ప్రకారం ఉపాధ్యాయ దంపతుల బదిలీలు సరైనవేనని హైకోర్టు సైతం పేర్కొందని గుర్తు చేశారు. ఉపాధ్యాయ దంపతుల బదిలీ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, మానవీయ కోణంలో సాధ్యమైనంత తొందరగా బదిలీ ప్రక్రియ చేపట్టేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా స్పౌజ్ ఫోరం కన్వీనర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కో-కన్వీనర్ కె.జీవన్‌రెడ్డి, కె. లక్ష్మీపతి, సి.హెచ్.రామకృష్ణ, పి.వీరేందర్, జి.శ్రీనివాస్‌రెడ్డి, బి.శంకర్, సి.హెచ్.సరిత, కె.పద్మావతి, బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 24: మండల కేంద్రంలోని ధర్మారం స్వామి గుట్టపై వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు చక్రపాణి మాధవాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం గ్రామం నుంచి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దంపతులు నేమూరి లత-సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, టీజేఎస్ నాయకుడు కంతి మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అందుబాటులోకి కొవిడ్ కిట్లు

మెట్‌పల్లి, డిసెంబర్ 23: మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో కొవిడ్-19 కిట్లు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ సాజిద్ అహ్మద్ తెలిపారు. కొవిడ్ పరీక్షలు చేసుకునేందుకు కిట్లను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

భక్తజన సంద్రమైన మల్లన్నపేట

- దొంగమల్లన్న స్వామిని దర్శించుకున్న 20వేల మంది

మల్లికార్జున స్వామికి మొక్కులు చెల్లించుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతాసురేశ్

గొల్లపల్లి : బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గొల్లపల్లి/మేడిపల్లి, డిసెంబర్ 24: గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామం భక్త జనసంద్రంగా మారింది. షష్ఠి ఏడు వారాల జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో వారమైన ఆదివారం దొంగమల్లన్న స్వామి జాతర ఘనంగా జరిగింది. స్వామిని సుమారుగా 20వేలమంది భక్తులు దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారుగా 4 గంటల సమయం పట్టింది. స్వామికి ప్రీతిపాత్రమైన బెల్లం అన్నం, పరమాన్నంతో బోనాలు తీసి భక్తులు నైవేద్యం సమర్పించారు. స్వామికి బెల్లంతో తూకం వేసి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. పట్నాలు, ప్రత్యేక దర్శనం, గండదీపం టికెట్ల అమ్మకం ద్వారా రూ.96,780 ఆదాయం వచ్చినట్లు ఆలయ పాండర్, ట్రస్టీ కొండూరి శాంతయ్య, ఈవో విక్రమ్ తెలిపారు. కాగా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతాసురేశ్, జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు దొంగమల్లన్న (శ్రీమల్లికార్జున) స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో జడ్పీటీసీ జలంధర్, సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ రాజన్న, బీఆర్ఎస్ మండల కో-ఆర్డినేటర్ గంగాధర్, గూండ్లపల్లి సర్పంచ్ ఈర్నాల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

రాగోజిపేటలో దొంగ మల్లన్న స్వామి కల్యాణం

మేడిపల్లి, డిసెంబర్ 24: భీమారం మండలం రాగోజిపేటలో ఆదివారం దొంగ మల్లన్న స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు బోనాలు తీసి స్వామి వారికి నైవేద్యాన్ని సమర్పించారు. సర్పంచ్ బాలసాని లహారిక, మారుతిగౌడ్, ఎంపీటీసీ చెన్నమనేని రమ్య, అజిత్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా గుంటి పెరుమాండ్లు కల్యాణం

కోరుట్ల, డిసెంబర్ 24: పట్టణ శివారు తాళ్ల చెరువు సమీపంలోని గుంటి పెరుమాండ్లు ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు చింత సునీలు ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్చకులు బ్రహ్మన్న గారి శంకర్‌శర్మ, ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

విద్యుత్తు దీపాలతో ముస్తాబైన సీఎస్ఐ చర్చ్

జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్ సమీపంలోని సీఎస్ఐ, గోవిందుపల్లెలోని ఏసురక్తం, ఎల్‌జీ గార్డెన్ సమీపంలోని ఎబ్రోన్, ధరూర్ క్యాంపులోని క్రైస్ట్ చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. చర్చిలను విద్యుత్తు దీపాలతో అలంకరించి క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు.

- జగిత్యాల టౌన్, డిసెంబరు 24

లోకమాత పోచమ్మ తల్లికి బంగారు పువ్వులతో పూజ

పోచమ్మ తల్లికి భక్తులు సమర్పించుకున్న బంగారు పువ్వులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 24: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలోని లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో పోచమ్మ తల్లికి భక్తులు అభిషేకంతో పాటు బంగారు పువ్వులను సమర్పించుకున్నారు. డీఎస్పీ వెంకటస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

పోగొట్టుకున్న గొలుసును భక్తుడికి అప్పగిస్తున్న సిబ్బంది

ధర్మపురి రూరల్, డిసెంబర్ 24: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును దేవస్థానం సిబ్బంది వెతికి అప్పగించారు. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబసమేతంగా ధర్మపురి క్షేత్రానికి దర్శనానికి వచ్చాడు. ఆదివారం ఉదయం స్వామివారి అభిషేకంలో పాల్గొన్నాడు. అనంతరం తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతుండగా తన మెడలో ఉన్న తులం బంగారు గొలుసు కనిపించడంలేదని గమనించాడు. దీంతో ఆలయ అధికారులకు సమాచారం అందించగా.. అప్రమత్తమైన సిబ్బంది సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు అభిషేకంలో పాల్గొన్న భక్తులకు ఫోన్ చేశారు. కాగా ఓ భక్తుడు తనకు బంగారు గొలుసు దొరికిందని తీసుకొచ్చి సిబ్బందికి అందజేశాడు. దీంతో సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డికి బంగారు గొలుసును తిరిగి అప్పగించారు.

క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న వైద్యులు

ఐఎంఏ వైద్యుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

కోరుట్ల రూరల్, డిసెంబర్ 24: మండలంలోని కల్లూరు గ్రామశివారులోని అక్షర పాఠశాల ఆవరణలో కోరుట్ల-మెట్‌పల్లి ఐఎంఏ వైద్యుల మధ్య ఆదివారం ఫ్రెండ్లీ 20-20 క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో కోరుట్ల వైద్యుల టీం గెలుపొందింది. కోరుట్ల టీం కెప్టెన్ డాక్టర్ రవికిరణ్ కప్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అనురూప్ రావు, కోరుట్ల ఐఎంఏ అధ్యక్షుడు రేగొండ రాజేశ్, కార్యదర్శి జగదీశ్, మెట్‌పల్లి ఐఎంఏ అధ్యక్షుడు గంగాసాగర్, కార్యదర్శి ఆనంద్, వైద్యులు అన్వేశ్, విద్యాసాగర్, సంపత్, వెంకట్‌రెడ్డి, రమేశ్, అక్షర స్కూల్ కరస్పాండెంట్ వెంకట సిద్ధార్థ్, సర్పంచ్ వనతడుపుల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్'కు అంతర్గాం విద్యార్థిని

అల్లెపు పూజ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 23: మండలంలోని అంతర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అల్లెపు పూజ ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కందుకూరి అజయ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి 29వరకు హైదరాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటారన్నారు. పూజను ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, సర్పంచ్ నారాయణ, ఉప సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడిపల్లి, డిసెంబర్ 24: గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఐదోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.వంద రుసుం చెల్లించి జనవరి ఆరో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు టీజీసీఈటీ.ఈజీజీ.జీఓఎస్. ఐఎన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

లక్ష తులసీ దళాలతో అర్చన

మారుతీనగర్, డిసెంబర్ 24: మెట్‌పల్లిలోని గోల హనుమాన్ ఆలయంలో వేదపండితుడు మదన్‌శర్మ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం రాత్రి హనుమాన్ విగ్రహానికి లక్ష తులసి దళాలతో అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో హనుమాన్ దీక్షాపరులు శివ, మారుతి, రాజ్‌కుమార్, స్వామి, నర్సయ్య, సురేశ్, రమేశ్, ప్రవీణ్, శ్రీను, గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరియర్ రామస్వామి వర్ధంతి

పెగడపల్లి, డిసెంబర్ 24: మండలంలోని ల్యాగలమర్రిలో ఆదివారం పెరియర్ రామస్వామి 50వ వర్ధంతిని భారత నాస్తిక సమాజం, అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రామస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుల మతాలు, మూఢనమ్మకాల నిర్మూలనకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉప్పలేటి నరేశ్, వడ్లూరి పెద్దలింగయ్య, గంధం జగన్, లింగంపల్లి రాజు, ఉప్పులేటి సత్యం, కనకయ్య, రాజు, అనిల్, తిరుపతి, అంజి, విజయ్, నవీన్, రాము తదితరులు ఉన్నారు.

ఆరట్టు మహోత్సవం

జగిత్యాల టౌన్, డిసెంబర్ 24: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆరట్టు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కన్నెస్వాములు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రామాలయం సమీపంలోని కెనాల్ వద్దకు తీసుకెళ్లి అక్కడ స్వామి వారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. 108 కళశాలతో మూలవిరాట్టుకు జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వైభవంగా పడిపూజ నిర్వహించి, అయ్యప్పస్వాములకు అల్పాహారం అందించారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం

జగిత్యాల టౌన్, డిసెంబరు 24: వృద్ధాశ్రమానికి ఓ ఎన్ఆర్ఐ ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా కేంద్రంలోని శివగాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి అమెరికాలో నివాసం ఉంటున్న అనంతుల శ్రీనివాస్ సతీమణి అపర్ణ జన్మదినం సందర్భంగా రూ.15 వేలు అందించారు. అపర్ణ తల్లి బోనగిరి జ్ఞానమ్మ ఆదివారం వృద్ధాశ్రమాన్ని సందర్శించి నిర్వాహకుడు శివశంకర్‌కు చెక్కును అందజేశారు.

నేడు అయోధ్య అక్షింతల శోభాయాత్ర

ధర్మపురి/మారుతీనగర్, డిసెంబర్ 24: రామ జన్మభూమి అయోధ్యలో పూజిత అక్షింతల మహా శోభాయాత్ర ధర్మపురి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తామని ట్రస్టు సభ్యుడు గాజు భాస్కర్ పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలోని హనుమాన్ వాడలో గల హనుమాన్ మందిరం నుంచి రామాలయం వరకు శోభాయాత్రను నిర్వహిస్తామన్నారు. అలాగే మెట్‌పల్లిలో సోమవారం నిర్వహించే అయోధ్య అక్షింతల శోభాయాత్రను విజయవంతం చేయాలని మెట్‌పల్లి నగర శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు పోహార్ తుక్కారాం భక్తులను కోరారు.